దేశ నిర్మాణంలో విద్యార్థుల భాగస్వామ్యం అవసరం

- 14న రెండో దశ ఇంటిగ్రేటెడ్ గురుకులాల మంజూరు
- ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యత అలవర్చుకోవాలి
- విద్యార్థులతో ముఖాముఖిలో సిఎం రేవంత్ రెడ్డి



విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సిఎంను కలిసి డైట్ ఛార్జీలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనీ, అందుకే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని తెలిపారు. ఇటీవలే 21 వేల మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించినట్టు గుర్తు చేశారు. అలాగే కొత్తగా మెగా డిఎస్‌సి నిర్వహించి 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు."ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల కోసం ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరంలోపు వాటిని అందుబాటులోకి తీసుకొస్తాం.. చదువుతో పాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయి. అందుకే విద్యార్థి, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణనందించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటిఐలను ఎటిసిలుగా మారుస్తున్నాం. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. తెలంగాణ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది.

విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించాలి" అని వారికి సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నవంబర్ 14న వేలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా 100కు డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయనీ, వాటికి దూరంగా ఉంటూ ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతను అలవరచుకోవాలని వారికి మార్గనిర్దేశనం చేశారు. సామాజిక న్యాయం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో సచివాలయంలో అడుగు పెట్టి, పరిపాలనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామసాయం రఘురాం రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని విజ్ఞప్తులకు ముఖాముఖి పరిష్కారం

- మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించే వేదికంగా ముఖాముఖి కార్యక్రమం నిలుస్తోందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, ఫించన్లు, అటవీ భూములు, ఆరోగ్య, భూమి, ఉద్యోగ, ఉపాధి సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో మంత్రి ముఖాముఖి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖాముఖి కార్యక్రామనికి ప్రజలు భారీగా తరలివచ్చి విజ్ఞప్తులు చేశారు. వాటిని మంత్రి పరిశీలించి కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరించారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేస్తూ సమస్యలను వివరిస్తూ పరిష్కారాలను సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు గత పదేళ్ల కాలంలో మంత్రుల అపాయిట్‌మెంట్ దొరికేది కాదన్నారు. టిపిసిసి సూచన మేరకు కాంగ్రెస్ కార్యకర్తల సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకు పోతున్నట్టు తెలిపారు. కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు తాను గాంధీభవన్‌కు వచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్‌కు మార్‌గౌడ్ మంచి సంప్రదాయానికి నాంది పలికారని తెలిపారు. బిజెపి నేతలు రాహుల్‌గాంధీ కులం అడుగుతున్నారని చెప్పారు. దేశంలో కులగణన చేపట్టి, అందులో భాగంగా రాహుల్ ఇంటికెళ్లి ఆయన కులాన్ని అడగాలని సూచించారు. ప్రపంచం లోనే ఎక్కడా లేనివిధంగా మన దేశంలో కులం ఉందని చెప్పారు. కుల వివక్షను పోగొట్టేందుకే కులగణన సర్వే చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టి తెలంగాణ రాష్ట్రం దేశాని కి రోల్ మోడల్‌గా నిలువబోతున్నదని చెప్పారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి 30 వినతులు, వివిధ మంత్రులకు సంబంధించి 63, ఇతర దరఖాస్తులు 37 మొత్తంగా 130 ఫిర్యాదు వచ్చినట్టు తెలిపారు.



రాష్ట్ర మహాసభ లోగోను ఆవిష్కరిస్తున్న చుక్క రాములు

సామాన్యులను పట్టించుకోని బిజెపి

- ధరల నియంత్రణలో విఫలం
- బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్న కేంద్రం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు
- రాష్ట్ర మహాసభ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం.. గతంలో అనుసరించిన ఆర్థిక విధానాలనే అమలు చేస్తూ సామాన్య ప్రజలను పట్టించుకోవడంలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సిపిఎం రాష్ట్ర 4వ మహాసభ లోగోను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్నత విద్యా సంస్థ అయిన ఐఐటి, పారిశ్రామిక ప్రగతికి చెందిన కంపెనీలు, వ్యవసాయానికి జీవనాధారమైన సింగూర్ ప్రాజెక్టు చిహ్నాలతో సిపిఎం రాష్ట్ర మహాసభ 'లోగో'ను తయారు చేసినట్టు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాలు అమలు చేస్తూ బహుళ జాతి సంస్థల దోపిడీకి కాపలా కాస్తున్న పరిస్థితి ఉందన్నారు. నైపుణ్యం పేరిట అప్రెంటిషిప్ విధానం అంటూ కార్పొరేట్లకు దోచి పెట్టాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ధరల పెరుగుదల భరించలేని స్థితికి చేరిందని, అయినా వాటిని నియంత్రించడంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సంఘటిత, అసంఘటిత రంగంలోని ప్రజలు ధరలను భరించలేని పరిస్థితి నెలకొందన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన కేంద్రం మీనమేషాలు లెక్కపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధికంగా ప్రజలు ఉపయోగించే టమాటా, ఆలు, ఉల్లి ధరలు వందల రెట్లు పెరిగిపోయాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్రం దారిలోనే నడుస్తుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రైతులు పండించిన పత్తి, వరి ధాన్యం కొనుగోలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు.

పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా ఉంటుందన్నారు. సిపిఎం రాష్ట్ర 4వ మహాసభ సంగారెడ్డి పట్టణంలో జనవరి 25 నుంచి 28వ తేదీల్లో జరగనున్నాయని తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, తెలంగాణ ప్రజల సంక్షోభంపై చర్చించను న్నట్టు చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. సంగారెడ్డిలో జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. మహాసభల సందర్భంగా జనవరి 25న జరిగే బహిరంగసభకు కేరళ ముఖ్య మంత్రి పినరయి విజయన్, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు, ఎం.నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు రేవంత్ కుమార్, లలిత, కృష్ణ, నాయకులు అశోక్, నరసింహారెడ్డి, సునీతా, మద్దూరు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారం సర్కారు విఫలం

- పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని (ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్) ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్‌బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వం పట్ల రైతాంగంలో వ్యతిరేకత ప్రారంభమైందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని చెప్పారు. పంట రుణాలు 2024-25 వానాకాలానికి రూ.81,477 కోట్లు ప్రణాళిక రూపొందించి నేటి వరకు ఆరు లక్షల మందికి రూ.పది వేల కోట్లు మాత్రమే రుణ పంపిణీ చేశారని తెలిపారు. రైతులు వ్యవసాయ తరుణంలో ప్రయివేటు రుణాలను అధిక వడ్డీకి తెచ్చి అప్పులౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వానాకాలం రైతు భరోసాను ఎగవేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. రైతు భరోసాను యాసంగితో కలిపి వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరణిలోని లోపాలను ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తునప్పటికీ పరిష్కారం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని గుర్తు చేశారు. కాలయాపనను నివారించి భూమాత సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రాష్ట్రంలో ఏటా ఆరు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయనీ, ప్రభుత్వం రైతాంగానికి ఉపయోగపడే విధంగా పంటల బీమా పథకాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. సన్నవడ్లకే కాకుండా దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి ధాన్యం కొట్టుకుపోతుందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బొంతల చంద్రా రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, పి.జంగారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, మాదినేని రమేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, లెల్లెల బాలకష్ణ, కందాల ప్రమీల, అన్నవరపు సత్యనారాయణ, బొంతు రాంబాబు, మాటూరి బాల్‌రాజ్ గౌడ్, ఈసంపెల్లి బాబు, శెట్టిపల్లి సత్తి రెడ్డి, యం శ్రీనివాసులు, పల్లపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధికి అపెక్స్ విరాళం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి సహాయ నిధికి తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ పాలక వర్గం రూ.1,51,01,116ని ప్రకటించింది. దానికి సంబంధించిన చెక్కును బుధవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆ బ్యాంకు చైర్మన్ ఎం.రవీందర్‌రావు, వైఎస్ చైర్మన్ కె.సత్తయ్య, పాలకమండలి సభ్యులు అందజేశారు.

జనగణనలో కులసర్వేను పరిగణనలోకి తీసుకోవాలి

- కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్‌ను కోరిన సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా 2025లో చేపట్టబోయే జనగణనలో తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పరిగణనలోకి తీసుకునే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సర్వే విషయంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలవనుందని తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభమైన సర్వే తీరును, ప్రక్రియను, పూర్తి స్థాయి వివరాలను ఈ సందర్భంగా గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం సిఎం తన సోదరుని కూతురు వివాహానికి గవర్నర్‌ను ఆహ్వానించారు. గవర్నర్‌తో భేటీ అయిన వారిలో సిఎంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, గుత్తా అమిత్ రెడ్డి ఉన్నారు.



సర్వేపై అపోహలొద్దు..

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి
- ఆటంకాలు కల్పిస్తే చట్టపరమైన చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవంబర్ 6 నుంచి 30 వరకు చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలూ పెట్టుకోవద్దని బిసి సంక్షేమం, రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను బుధవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని జిల్లాల్లోనూ బుధవారం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైందని తెలిపారు. సర్వే నిర్వహణకు ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేస్తూ జిఒ జారీ చేసిందన్నారు. ఎన్యుమరేటర్ బ్లాక్‌గా గుర్తించిన మ్యాప్ ప్రకారంగా ఇళ్లను సర్వే చేసి స్టిక్కర్ వేసి ఇంటి యజమానులకు సమగ్ర కుటుంబ సర్వేపై సమాచారం ఇస్తారన్నారు. సర్వేపై ఎప్పటికప్పుడూ సమీక్షిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 17 లక్షల 44 వేల ఇళ్ల సర్వేకు 88 వేల మంది ఎన్యుమరేటర్లను నియమించినట్టు తెలిపారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 ఇళ్లు కేటాయించారని, కుటుంబానికి సంబం ధించిన అన్ని రకాల సమాచారం తీసుకుంటారని అన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకూ గురి కావద్దని, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ స్థితిగతులు తెలుసుకునే ప్రయత్నమే ఈ సర్వే అని అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న సమాచారంతో భవిష్యత్‌లో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనం కలుగుతుంద న్నారు. ఈ సర్వేతో ఎవరికీ అన్యాయం జరగదని, ఇబ్బందులు కలగవని, భవిష్యత్‌లో అందరికీ న్యాయం జరిగే విధంగా దోహదపడుతుందని చెప్పారు. ఈ సర్వేతో రాష్ట్రం దేశానికే దిక్సూచి కాబోతుందన్నారు. ప్రజలను భ్రమ పెట్టి, భయ పెట్టే విధంగా ప్రవర్తించకూడదని, అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని ప్రతిపక్షాలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. సర్వేకు ఆటంకాలు కల్పిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాచార సేకరణ అధికారికి అన్ని వర్గాల వారు పూర్తిగా సహకరించి సమగ్ర సమాచారాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అందరికీ సామాజిక న్యాయం

- అందుకే కులగణన...
- బిఆర్ఎస్ సర్వే ఎవరి కోసం చేసిందో? ఎందుకోసం చేసిందో?
- హరీశ్‌రావుకు విద్యాహక్కు చట్టంపై అవగాహన లేదు
- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ లక్ష్యాల సాధన కోసం అందరికి సామాజిక న్యాయం అందించేందుకు కులగణన చేపట్టినట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. కులగణన నిర్వహిస్తే ఎవరెంత మంది ఉన్నారో తెలుస్తుందనీ, ఆ వివరాలతో వారికి రాజకీయ, ప్రభుత్వ సంక్షేమ,, అభివృద్ధి ఫలాలు అందించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిరావు ఫూలే ప్రజాభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్ హయాంలో నిర్వహించిన సర్వే ఎవరి కోసం నిర్వహించారో? ఎందు కోసం నిర్వహించారో? వారికే తెలియాలని ఎద్దేవా వేశారు. బిఆర్ఎస్ సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకు కాలం చెల్లిపోయిందని, అందులోని సర్వే అంశాలు..కుల గణన సర్వే అంశాలు భిన్నమైనవన్నారు. బిఆర్ఎస్ తీరుగా కాకుండా తాము చేపట్టిన కులగణన వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. అయితే కుటుంబాలు, వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచనున్నట్టు చెప్పారు. సంపదను, సహజ వనరులను, ఆస్తులను సమానంగా అందరికి అందించాలన్నదే తమ విధానమని, ఇది ఇష్టం లేకే కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమగ్ర సమగ్ర సమాచారం వస్తే.. సంపద ఇంకా ఎంత మందికి అందలేదు అనేది తెలుస్తుందని చెప్పారు.

రాజకీయ అవకాశాలు అందాయా..? ఎలాంటి అవకాశాలు వచ్చాయి అనేది సర్వేలో తేలుతుందని స్పష్టం చేశారు. సర్వే కుల వివాదాలను రగిలిస్తుందన్న ఆరోపణలు అర్థరహితమని, తెలంగాణ కుల గణన దేశానికి దిక్సూచీ వంటిదని, రోల్ మోడల్ అని ఇప్పటికే రాహుల్ గాంధీ సైతం చెప్పారని గుర్తుచేశారు. సర్వేకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించు కోవడం విద్యాహక్కు చట్టం నిబంధనలను ఉల్లంఘించడమేనని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించడం అవగాహనా రాహిత్యమని కొట్టిపారేశారు. బిహార్‌లో కులగణన ప్రక్రియ సత్ఫలితాలిచ్చిందా లేదా అన్నది ఆ రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారమన్నారు. దేశంలో అనేక సామాజిక సమస్యలకు కులగణనతో పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు క్యాబినెట్ నిర్ణయించి, అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రవ్యాప్తంగా సర్వే మొదలుపెట్టినట్టు తెలిపారు. ఈ సర్వే భవిష్యత్తులో ప్రణాళికలు రూపొందించేందుకు ఉపయోగపడు తుందని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం, సొంత రాజ్యాంగం లాగా కులగణన విప్లవాత్మకమైన చర్య అని అభివర్ణించారు. దేశంలో కులం, కులవివక్ష ఉందనేది వాస్తవమన్నారు.ఈ సర్వే రిపోర్టులో బయటపడుతుందని చెప్పారు. ఆ వివక్షతను రూపుమాపే క్రమంలో కులగణన దోహదపడుతుందని తెలిపారు.

విద్యాశాఖ నిర్లక్ష్యం

- ప్రారంభం కాని టెట్ దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించింది. దీంతో ఉపాధ్యాయ అభ్యర్థులంతా ఎంతో ఆశగా దరఖాస్తు చేయాలని భావించారు. కానీ వారికి నిరాశే ఎదురైంది. మంగళవారం సాయంత్రం వరకు టెట్ వెబ్‌సైట్ తెరుచుకోలేదు. ఉపాధ్యాయ అభ్యర్థులు విద్యాశాఖ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్షలాది మంది అభ్యర్థులకు సంబంధించిన టెట్ నిర్వహణపై విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. టెట్ సమాచార బులెటిన్, పూర్తిస్థాయి నోటిఫికేషన్ అప్‌లోడ్ చేసేందుకు సాంకేతిక సమస్యలు వచ్చాయంటూ ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలను గురువారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. అదేరోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈ నెల 20 వరకు ఉందని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానంలో వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి 20వ తేదీ వరకు రాతపరీక్షలను నిర్వహిస్తామని వెల్లడించింది. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కులగణన పారదర్శకంగా జరగాలి

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ కులగణన అవసరమని అన్నారు. దాని వల్లే జనాభా శాతాన్ని బట్టి రిజర్వేషన్లను కేటాయించడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. దేశంలో కులవివక్ష, అసమానతలు ఉన్నాయనీ, అవి ఏ మేరకు ఉన్నాయో ఈ కులగణన కార్యక్రమం ద్వారా తెలుస్తుందన్నారు. కులగణనపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయనీ, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. మూసీ నది పునరుజ్జీవం సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ ముందుకు తేవడాన్ని ఆయన ఖండించారు. దానికోసం రూ.1.50 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయాలనుకోవడం సరైంది కాదన్నారు. మూసీ నది తీరం వెంట వేలాది పేద కుటుంబాలు నివాసముంటున్నాయనీ, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించాలనుకోవడం అన్యాయమని విమర్శించారు. రైతు భరోసా, రూ.రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2,500 వంటి అనేక హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవానికి పూనుకోవడం పట్ల తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రమ, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌ఎల్ పద్మ, వి ప్రవీణ్, పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు డి స్వరూప, నగర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మిబాయి, వరలక్ష్మి, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తేయాలి

- ఇథనాల్ కంపెనీల ఏర్పాటుపై పునఃసమీక్షించాలి
- తెలంగాణ పీపుల్స్ జెఎసి కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సామాజిక బాధ్యత కలిగిన ప్రజాపక్ష విద్యావేత్త ఆరేపల్లి విజయ్‌కుమార్‌పై ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను బేషరుతుగా ఎత్తేయాలని తెలంగాణ పీపుల్స్ జెఎసి కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో తెలంగాణ పీపుల్స్ జెఎసి కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, పిఒడబ్ల్యు జాతీయ అధ్యక్షులు వి.సంధ్య, కమిటీ కో-కన్వీనర్లు అంబటి నాగయ్య, కన్నెగంటి రవి తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, జెఎసి చైర్మన్‌గా ప్రజా ఉద్యమాలకు సంఘీభావం తెలుపుతున్నారని చెప్పారు. ఇథనాల్ పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడుతున్నందున ఆయనను విద్యాశాఖాధికారులు ఈ నెల 2న సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. దాంతోపాటు నిర్మల్ నుంచి ఆయన బయటకు వెళ్లడానికి అనుమతి లేదంటూ పెట్టిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని కోరారు. చిత్తనూరు, దిలావర్పూర్, గుండంపల్లి, రాష్ట్రంలోని ఇతర చోట్ల ఇథనాల్ కంపెనీల ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న గ్రామీణ ప్రజలతో ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ కంపెనీల విషయంలో ప్రజలు లేవనెత్తుతున్న అభ్యంతరాలను లోతుగా పరిశీలించాలని, ప్రజలు, ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని కోరారు. రాష్ట్రంలో 30 ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం పున:సమీక్షించాలని, కేంద్ర ప్రభుత్వం విచక్షణా రహితంగా తెచ్చిన ఇథనాల్ పాలసీని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలు సంఘాల నేతలు విస్సా కిరణ్ కుమార్, బి.కొండల్ రెడ్డి, కరుణాకర్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

కేశవాపూర్ రిజర్వాయర్ కాంట్రాక్ట్ రద్దు

- త్వరలో నూతన టెండర్లు పిలిచేందుకు నిర్ణయం
- కొత్త రూట్‌మ్యాప్‌తో తగ్గనున్న ప్రాజెక్ట్ వ్యయం
- మూసీలో గోదావరి జలాలను నింపాలనే లక్ష్యంగా ప్రణాళిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత బిఆర్ఎస్ ప్రభుత్వం తలపెట్టిన కేశవాపురం రిజర్వాయర్ పనులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. గోదావరి జలాలను కొండపోచమ్మసాగర్ నుంచి కేశవాపురం రిజర్వాయర్‌కు అక్కడి నుంచి తాగునీటి అవసరాల కోసం హైదరాబాద్‌కు తరలించేందుకు వీలుగా గత ప్రభుత్వం డిజైన్ చేసిన పనులను నిలిపివేసింది. కాంట్రాక్టును రద్దు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఇంజినీరింగ్ విభాగం జిఒ జారీ చేసింది. ఈ నిర్ణయంతో దాదాపు రూ.2 వేల కోట్ల ఖర్చు ఖజానాకు మిగులుతాయని ప్రభుత్వం తెలిపింది. ఆ ఖర్చుతో గోదావరి ఫేజ్- 2 స్కీమ్‌ను మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల వరకు పొడిగించి, గ్రేటర్ సిటీ అవసరాలకు తాగునీటిని అందించేలా ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

హైదరాబాద్‌కు 10 టిఎంసిల తాగు నీటిని సరఫరా చేయటంతోపాటు జంట జలాశయాలకు 5 టిఎంసిల నీటిని అందించేలా మల్లన్నసాగర్ నుంచి బహుళ ప్రయోజనాలుండేలా 15 టిఎంసిల నీటిని పంపింగ్ చేయనున్నారు. ఈ కొత్త రూట్ మ్యాప్‌కు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ పనులకు టెండర్లు పిలవాలని జలమండలి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించిన సంగతి విదితమే.. పాత టెండర్ల ప్రకారం ఎల్లంపల్లి నుంచి వచ్చే గోదావరి నీటిని మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్, అక్కడి నుంచి లిఫ్ట్ చేసి కేశవాపురం చెరువును నింపుతారు. కేశవాపురం చెరువులో 5 టిఎంసిల నీటిని నిల్వ చేసే రిజర్వాయర్‌గా నిర్మిస్తారు. అక్కడి నుంచి ఘన్‌పూర్ మీదుగా హైదరాబాద్‌కు 10 టిఎంసిల తాగునీటిని అవసరాలకు సరఫరా చేయాల్సి ఉంది. ఆరేళ్లు గడిచినా ఈ పనులు ప్రారంభంకాలేదు. భూసేకరణ చిక్కులతోపాటు అనాలోచితమైన అలైన్‌మెంట్ కారణంగా ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగలేదని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వం అటవీ భూములు, రక్షణ శాఖ భూముల నుంచి ప్రాజెక్టును డిజైన్ చేయడం, ఎంచుకున్న పైపులైన్ రూట్ సరిగ్గా లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదని ఉత్తర్వుల్లో పేర్కొంది. తక్కువ ఖర్చుతో గ్రేటర్ సిటీకి తాగునీటి సరఫరాతోపాటు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లను నీటిని నింపేందుకు ఎక్కువ భాగం గ్రావిటీతో వచ్చేలా కొత్త అలైన్‌మెంట్ ప్రకారం పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో గోదావరి నీటిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఇప్పటి వరకు ఉన్న అడ్డంకులు తొలిగిపోనున్నాయి. కేశవాపురం రిజర్వాయర్ నిర్మాణానికి అయ్యే ఖర్చు తగ్గిపోతుంది. అక్కడ ఆదా అయ్యే ఖర్చుతో ఇంతకాలం నిర్యక్షానికి గురైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తాయని ప్రభుత్వం పేర్కొంది. హైదరాబాద్ తాగునీటికి అందిస్తున్న ఖర్చు ఒక కిలో లీటర్ ఫర్ డేకు రూ.48 వరకు ఖర్చవుతుండగా, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఒక కిలో లీటర్ ఫర్ డేకు రూ.4 ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

సమగ్ర సర్వేపై సందేహాలెన్నో!

- ఉమ్మడి కుటుంబ ఆస్తుల వివరాలు చెప్పేదెట్లా
- వలసల్ని నమోదు చేస్తే స్థానిక బెనిఫిట్స్ పోతాయన్న ఆందోళన
- కౌలు వివరాలకు భూ యజమానుల ధ్రువీకరణ కష్టం
- ప్రభుత్వ పథకాలకు సర్వేనే ప్రామాణికమంటున్న సర్కార్


సర్వే చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుల గణన పేరిట నిర్వహించే సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల.. సమగ్ర కుటుంబ సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. బీసీ కుల గణన చేసి జనాభా లెక్కలు తేలిస్తే సామాజిక న్యాయం చేకూరుతుందన్న సానుకూలత ఒక వైపు అయితే, సర్వేతో కుటుంబ సమాచారమంతా కూపీ లాగి సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, చదువులకు దూరం చేస్తారా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే ఫార్మెట్‌లో అడిగిన 56 ప్రధాన ప్రశ్నలు, మరికొన్ని ఉప ప్రశ్నల్లో ఆస్తులు, లబ్ధిపొందిన సంక్షేమ పథకాలు, వలసలు, రాజకీయ ప్రస్తావన, కుల వృత్తులు, పడావు భూములు, కౌలు సాగు వివరాల విషయంలో పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో అనేక అనుమానాలు, భయాందోళనలున్నాయి. సమాచార సేకరణ పేరిట రాబోయే కాలంలో ప్రభుత్వ పథకాలకు దూరం చేసే కుట్ర ఏమైనా ఉందా.. అనే ప్రశ్నలు జనంలో మొదలయ్యాయి.

నేటి నుంచి ఇంటింటి కుటుంబ సర్వే

రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టాలని మంత్రి మండలి నిర్ణయం మేరకు 2024 ఫిబ్రవరి 4న శాసనసభ తీర్మానం చేసింది. ప్రణాళిక శాఖ ద్వారా నిర్వహించే ఈ కుటుంబ సర్వే ఈ నెల 6 నుంచి 18 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామం, మున్సిపాలిటీలు, నగరాల్లో ఉన్న కుటుంబాల సంఖ్యను బట్టి బ్లాకులుగా విభజించారు. 150 కుటుంబాలకు ఒక బ్లాక్, బ్లాక్‌కు ఒక ఇన్యుమరేటర్, పది మంది ఇన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ చొప్పున ప్రభుత్వ యంత్రాంగం సర్వే విధుల్లో పాల్గొననుంది. ఇప్పటికే సమగ్ర సర్వే నిర్వహణకు సంబంధించి శిక్షణ పూర్తి చేసి బుధవారం నుంచి ఫీల్డ్‌లోకి వెళ్లనున్నారు. ఇన్యుమరేటర్ కేటాయించిన బ్లాక్‌లో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి సర్వే ఫార్మెట్‌లో పేర్కొన్న ప్రధాన, ఉప ప్రశ్నలన్నింటికీ వివరాల్ని సేకరిస్తారు. పార్ట్-1లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలు, విద్య, ఉద్యోగ, ఉపాధి, భూమి, రిజర్వేషన్లు, రాజకీయ, వలస వెళ్లిన వివరాలుంటాయి. పార్ట్-2లో కుటుంబ వివరాల్లో ఐదేండ్లలో తీసుకున్న రుణాలు, పొందిన పథకాలు, పశు సంపద, స్థిర, చరాస్తి, భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాహనాలు, కులం, ఉపకులం, మతం, భాష, వ్యాధులు, విద్యార్హతలు, పొందిన రిజర్వేషన్లు, వ్యాపారాలు, వార్షికాదాయం, కుల వృత్తులు, రాజకీయ సమాచారం కోసం ప్రశ్నల వివరాల్ని నమోదు చేస్తారు.

ప్రశ్నల పట్ల సందేహాలు

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కోసం రూపొందించిన ప్రశ్నావళి ఫార్మెట్‌లో పేర్కొన్న పలు అంశాల పట్ల ప్రజల్లో అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే ద్వారా సేకరించిన సమాచారం ప్రభుత్వానికి సరైన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయ పడుతుందని సీఎం ప్రకటించినా.. ప్రజల్లో అనుమానాలు మాత్రం పోలేదు. సర్వేలో పేర్కొన్న ప్రశ్నల ద్వారా రాష్ట్రంలో ఉన్న కుటుంబాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నది ఎవరు..? దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నదెవరు..? అనేది స్పష్టంగా తేలుద్ది. ఎందుకంటే కుటుంబం వారిగా భూములు, స్థిరాస్తులు, పథకాల్లో లబ్ధిపొందిన వివరాలు, దేశ, విదేశీ వలసలు, ప్రభుత్వ, ప్రయివేట్ అప్పులు, వాహనాలు, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలు, కుల వృత్తిలో కొనసాగుతున్నది.. లేనిది..? ఇప్పటికే రిజర్వేషన్లు పొందింది, వార్షికాదాయం వంటి వివరాల్ని చెబితే తమ కుటుంబాలకు ప్రభుత్వాల నుంచి సహాయం అందుతుందో లేదో అన్న భయాందోళనలు నెలకొన్నాయి. ఉమ్మడి కుటుంబానికి చెందిన భూములు, స్థిరాస్తులుంటే పెండ్లయి ఒకే ఇంట్లో ఉన్న అన్నదమ్ముల్లో ఏ కుటుంబం కింద ఆ ఆస్తుల వివరాల్ని పొందుపర్చాలనేది అనుమానంగా ఉంది. ఆ కుటుంబంలో ఒకరు ఉద్యోగ, వ్యాపారం చేసి ఆర్థిక స్థితి మెరుగైతే, మరొకరు పేదరికంలోనే మగ్గుతుంటే.. ఉమ్మడిగా ఆస్తులున్నాయని నమోదు చేస్తే నష్టపోయేది ఎవరు..? వాహనాల వివరాల్లో బైక్, ట్రాక్టర్, టిల్లర్, వ్యాన్ వంటివి ఈఎంఐ పద్ధతిలో కొంటారు. కానీ..! వాటి విలువ లెక్కించి ఆర్థిక స్థోమత కలిగిన వాళ్లుగా నమోదు చేస్తే నష్టం తప్ప లాభమేంటి..? ఇంట్లో వాషింగ్ మిషన్లు, స్మార్ట్‌ఫోన్స్, కంప్యూటర్‌లుంటే స్థితిమంతులవుతారా..? ఐదేండ్ల కాలంలో ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందితే రాబోయే కాలంలో ఆ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోతాయనే భయం ఏర్పడుతుంది. రైతు భరోసా, ఇండ్లు, రైతు బీమా అస్సలు ఇవ్వలేదు. వాటి సమాచారం అడిగారు. అసైన్డ్, అటవీ భూముల్లో ఉన్నా పట్టాల్లేవు. వాటిని ఎలా నమోదు చేయాలి. ఇక విదేశాలకు చదువుల రీత్యా, తాత్కాలిక అవసరాల రీత్యా వలసలు వెళ్లే వాళున్నారు. హైదరాబాద్, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, బెంగాల్, ఏపీ వంటి రాష్ట్రాలకు సీజన్ల వారీగా ఉపాధి కోసం తాత్కాలికంగా వలస వెళ్లి బతికి వస్తారు. వారి వివరాల్ని నమోదు చేస్తే స్థానికంగా వస్తున్న బెనిఫిట్స్ పోతాయనే గుబులు నెలకొంది. స్థానికత్వం కోల్పోతే పిల్లల చదువు, ఉద్యోగ అవకాశాలకు నష్టమనే భావనా ఉంది. ఇక వార్షికాదాయం రెండు లక్షలు దాటితే పిల్లలకు ఉపకార వేతనాలు, ఇతర బెనిఫిట్స్ ఉండవు. భూముల వివరాల్లో పడావు కాలముంది. పడావు ఉందని పేర్కొంటే రాబోయే కాలంలో రైతు భరోసా ఇవ్వరనే అనుమానమూ ఉంది. అలాగే కుల వృత్తి చేసే వాళ్లు, చేయని వాళ్ల గురించీ అడిగారు. కల్లుగీత, చేనేత వృత్తి గిట్టుబాటు కాక చేయని వాళ్లున్నారు. వారికి సర్కార్ ఇస్తున్న వృత్తిదారుల ఫించన్లు రద్దు చేస్తారనే బెంగ పట్టుకుంది. అలాగే కౌలుదారులు సాగు చేస్తున్న భూముల వివరాలూ అడిగారు. భూ యజమానులు కౌలుదారులకు ఎలాంటి ధృవీకరణ ఇవ్వట్లేదు. అప్పుడు సర్కార్ ఇచ్చిన హామీలో కౌలుదారులకు రైతు భరోసా ఎలా ఇస్తారనే సందేహాలున్నాయి. రియల్ ఎస్టేట్, స్థిరాస్తుల వ్యాపారాల గురించీ అడిగారు. అవి సీజనల్‌గా నడిచేవి తప్ప స్థిరంగా కొనసాగవు. వాటిని ఎలా ధృవీకరిస్తారనేది స్పష్టతలేదు. ప్రభుత్వ, ప్రయివేట్ అప్పుల కాలంలో సమభావన రుణాలడిగారు. మహిళలు అప్పు తీసుకుని తిరిగి చెల్లిస్తారు. అలాంటి వాళ్ల వివరాలు బ్యాంకు వద్ద తప్ప ఎక్కడా ఉండవు. అవి సర్కార్ సేకరిస్తే మహిళలంతా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నట్టుగా భావించి వారి కుటుంబాలను రాయితీ పథకాలకు అనర్హుల్ని చేసే ప్రమాదం లేకపోలేదన్న అనుమానం ప్రజల్లో ఉంది. రాజకీయ సమాచారంలో పార్టీల ప్రస్తావనెందుకు..? ఎంపిటిసి, సర్పంచ్‌గా చేసినా అనేక మంది కూలినాలి చేస్తున్నరు. గోప్యంగా ఉంచాల్సిన వ్యాధులెలా చెప్పాలనే డౌట్ ఉంది. ఒక్క ఇంట్లో రెండు మూడు కుటుంబాలుంటాయి. వారి వివరాల నమోదులోనూ ఇబ్బందులుంటాయి.

సర్వే కోసం పరుగులు

ఈ నెల 6 నుంచి 18 వరకు నిర్వహించే సర్వే కోసం పరుగులు పెట్టాల్సి వస్తుంది. మొదటి మూడు రోజుల్లోనే సర్వే పట్టిష్టంగా సాగనుంది. గ్రామాల నుంచి 45 శాతం మంది తాత్కాలిక వలసవెళ్లి పట్టణాల్లో ఉంటున్నారు. వాళ్లంతా ఊరికెళ్లాలి. 80 శాతం కుటుంబాల నుంచి పిల్లలు చదువుల కోసం, యువతీయువకులు ఉపాధి, ఉద్యోగం కోసం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నోళ్లంతా సొంతూరి బాట పట్టాల్సి వస్తుంది. బీఆర్ఎస్ సర్వే అప్పుడూ ఇవే తిప్పలొచ్చాయి. ఇప్పుడూ అవే తిప్పలతో ప్రజలు బెంబెతెత్తుతున్న పరిస్థితి.

జర్నలిస్టుల రక్షణ చట్టంపై పిసిఐ సిఫారులు అమలు చేయాలి

- కేంద్రానికి టిడబ్ల్యుజెఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో జర్నలిస్టుల భద్రత, రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) చేసిన సిఫారసులు అమలుచేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఐఎఫ్‌డబ్ల్యుజె జాతీయ ఉపాధ్యక్షులు పి ఆనందరం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో మీడియా సిబ్బంది అరెస్టులు, తప్పుడు నిర్బంధాలు బెదిరింపులపై ప్రెస్ కౌన్సిల్ సభ్యులు గుర్బీర్‌సింగ్ రూపొందించిన నివేదికను పిసిఐ ఆమోదించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో జర్నలిస్టుల రక్షణ భద్రత కోసం జాతీయ చట్టాన్ని ప్రకటించడం, ప్రెస్ కౌన్సిల్ యాక్ట్‌ను సవరిస్తూ మరిన్ని అధికారాలు ఇవ్వడం, ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియాతో వ్యవహరించే విధానంపై పోలీసులకు అవగాహన కల్పించటం, చట్టాన్ని అమలు చేసే సంస్థల ప్రవర్తనా నియమావళిని క్రోడీకరించాలని కేంద్రానికి పిసిఐ నివేదిక సిఫారసు చేసిందన్నారు. వీటిని ఆమోదిస్తూనే జర్నలిస్టుల రక్షణ విషయంలో ప్రెస్‌కౌన్సిల్ మరింత చైతన్యంతో వ్యవహరించాలని సూచించారు. అవసరమైతే సుమోటోగా కేసులు నమోదు చేసి విచారించాలని కోరారు. అలాగే ఇటీవల పిసిఐ తెలంగాణకు చెందిన కొన్ని జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించిందనీ, అది అసంబద్ధంగా ఉందన్నారు. ఎలాంటి దరఖాస్తులు స్వీకరించకుండా, రాష్ట్ర ప్రభుత్వ జీవో 239 ద్వారా గుర్తింపు పొందిన సంఘాలకు కాకుండా ఇష్టానుసారంగా ప్రెస్‌కౌన్సిల్ ప్రాతినిధ్యం ఇవ్వడం సరికాదన్నారు. ఈ అంశాన్ని మరోసారి పిసిఐ పరిశీలించి ఇతర సంఘాలకూ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



సాగర్‌లో విద్యుత్ ఉత్పత్తిపై కెఆర్‌ఎంబి ఆంక్షలు

- అవసరమైతే ఉత్పత్తి చేస్తామంటున్న జెన్కో

ప్రజాశక్తి - హైదరరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్‌లో జల విద్యుత్ ఉత్పత్తిపై కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఆంక్షలు విధించింది. ఈ విషయంలో ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని రెండు రాష్ట్రాలకు సంబంధించి రెండో పంటకు కూడా సాగునీరు ఇచ్చేలా, సరిపోయేంత తాగునీరు ఉండేలా చూసుకోవాలని తెలియజేసింది. దీని కోసం నాగార్జునసాగర్‌లో ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిపై ఆంక్షలు పెట్టింది. అయితే, ఈ విషయంలో నాగార్జునసాగర్ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ మంగేష్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాల మేరకు ఉత్పత్తి చేపడతామన్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 580 అడుగుల నీటిమట్టం ఉన్నంతవరకు జెన్‌కో విద్యుత్ ఉత్పత్తిని చేపట్టే వెసులుబాటు ఉందని తెలిపారు. ఏదైమైనా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము పని చేస్తామని చెప్పారు.

"బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్ గైడ్‌తో అవగాహన

-ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పక్షుల గురించి భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ (హెచ్‌బీపీ) సభ్యులు రూపొందించిన "బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్ గైడ్ ఉపయోగ పడుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ప్రజాభవన్‌లో ఆయన పాకెట్ గైడ్‌ను ఆవిష్కరించారు. ఈ పుస్తకం అవసరాన్ని హెచ్‌బీపీ కోర్ కమిటీ సభ్యులు భట్టికి వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పాకెట్ గైడ్‌ను రూపొందించినందుకు హెచ్ బిపి సభ్యులను అభినందించారు. హెచ్‌బిపి అధ్యక్షులు అడెపు హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పక్షుల ఆహారం, వలసలు, పరిరక్షణ స్థితి గురించి తెలుసుకోవటానికి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని చెప్పారు. ప్రత్యేక జీవ వైవిధ్యంతో కూడుకొన్న తెలంగాణ ప్రకతితో మమేకం కావటానికి ప్రోత్సహిస్తుందని తెలిపారు. మొత్తం 252 ముఖ్యమైన పక్షి జాతులను కలిగి ఉన్న ఈ పాకెట్ గైడ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిజిపి తేజ్‌దీప్‌కౌర్ తదితరులు పాల్గొన్నారు.



పద్మరాగ రెస్టారెంట్ ప్రారంభం

- అనాథ పిల్లలకు సాయం

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని కొంపల్లిలోని డిమార్ట్ వద్ద ఆధునికరించిన 'పద్మరాగ రెస్టారెంట్ అండ్ బాంక్వెట్'ను ఏర్పాటు చేశారు. బుధివారం ఈ రెస్టారెంట్‌ను ఆదర్శ ఫౌండేషన్‌కు చెందిన అనాధ పిల్లల చేతుల మీదుగా ప్రారంభించారు. తమ ఈ రెస్టారెంట్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటుందని పద్మరాగ గ్రూప్ ఆఫ్ రెస్టారెంట్స్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి తెలిపారు. అనంతరం పిల్లలకు స్కూల్ బ్యాగ్స్, యూనిఫామ్స్, పుస్తకాలు, షఉస్ పంపిణీ చేశారు. పిల్లలకు రెస్టారెంట్‌లోని రుచికరమైన వివిధ రకాల వంటకాలను వడ్డించారు. భోజన ప్రియులకు రుచికరమైన ఆహారాన్ని అందించడమే కాకుండా సామాజికంగా సానుకూల ప్రభావాన్ని చూపించడం కూడా మా లక్ష్యమన్నారు.

గీతం విద్యార్థికి రూ.60 లక్షల వార్షిక వేతనం

ప్రజాశక్తి - హైదరరాబాద్ బ్యూరో

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరోసారి ప్రాంగణ నియామకాల్లో మేటిగా నిరూపించుకుంది. ప్రతిష్టాత్మక బహుళజాతి సంస్థల భాగస్వామ్యంతో 2024-25 విద్యా సంవత్సరానికి అత్యధిక గరిష్ట వార్షిక వేతనం రూ.60 లక్షలతో ఒక విద్యార్థిని ఎంపిక కాగా, మరో ఇద్దరు రూ.51 లక్షల గరిష్ఠ వార్షిక వేతనానికి ఎంపికయ్యారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని యర్రం అనూష అట్లాసియన్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకుని, రూ.60 లక్షల వార్షిక వేతనాన్ని పొందనున్నారు. అంతేగాక తన తోటి విద్యార్థిని కొర్రపాటి సమీనాతో కలిసి మైక్రోసాఫ్ట్‌లో రూ.51 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎంపికైంది. ఈ ప్లేస్‌మెంట్ సీజన్‌లో గీతం విద్యార్థుల విజయం, వారి కృషిని మాత్రమే కాకుండా విశ్వవిద్యాలయం బలమైన పరిశ్రమ-విద్యా సంబంధ అనుబంధాలను, అధిక నాణ్యత గల విద్యను అందించడంలో నిబద్ధతను తెలుపుతోంది. ఇతర బహుళ జాతి సంస్థల ప్రాంగణ నియామకాల్లోనూ విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు.

సిసిఎల్‌ఎ అసిస్టెంట్ సెక్రటరీగా లచ్చిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిప్యూటీ కలెక్టర్ వి.లచ్చిరెడ్డిని భూ పారిపాలనా శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా నియమిస్తూ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిఒ నెంబర్ 408ని విడుదల చేశారు. ఇటీవల ఆయనను సిఎంఆర్ఒ ప్రాజెక్ట్ డైరెక్టర్ పోస్ట్ నుంచి బదిలీ చేసిన ప్రభుత్వం వెకెన్సీలో ఉంచింది. అయితే తాజాగా అదే కార్యాలయానికి అదనపు కార్యదర్శిగా ప్రభుత్వం నియమించడం గమనార్హం

డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బూసాని వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బూసాని వెంక టేశ్వరరావు, సభ్యులుగా ఐఎఫ్ఎస్ అధికారి, బిసి గురుకులాల కార్యదర్శి బడుగు సైదులు బుధవారం హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్‌లో గల డిఎస్ఎస్ భవన్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల నివేదిక తయారు చేయడానికి తమ కమిషన్ పనిచేస్తుందని తెలిపారు. అనంతరం బూసాని వెంకటేశ్వరరావు, సైదులు ఖైరతాబాద్‌లో బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బిసి కమిషన్ డిప్యూటీ డైరెక్టర్, శ్రీనివాస్ రావు, లక్ష్మి నారాయణ రీసెర్చ్ ఆఫీసర్, ప్రత్యేకాధికారి జి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన మద్యం సరఫరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం మద్యం సరఫరా నిలిచి పోయింది. సాంకేతిక కారణాల వల్ల మద్యం డిపోల నుంచి డీలర్లు లిక్కర్‌ను తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో షాపులకు మద్యం ఆన్‌లైన్ ద్వారా సరఫరా కొనసాగుతోంది. ఈ క్రమంలో డీలర్లు మద్యం కోసం డిపోల చుట్టు తిరిగుతున్నారు. అనుకోకుండా ఏర్పడ్డ సాంకేతిక సమస్యను రాత్రి లోపు పరిష్కరిస్తామని అబ్కారి శాఖ అధికారులు తెలిపారు.

భవిష్యత్ అవసరాలకు మామూనూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణం

- రెండేళ్లలో భూసేకరణ పూర్తి చేయాలి
- మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరరాబాద్ బ్యూరో

వరంగల్‌లోని మామూనూర్ ఎయిర్‌పోర్టు కోసం భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాత్కాలిక ఏర్పాట్ల కన్నా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విమానాశ్రయం నిర్మించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మామునూర్ ఎయిర్‌పోర్టుపై ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ 15 రోజులకోసారి పనుల పురోగతిపై తాను సమీక్షిస్తానని చెప్పారు. విమానాశ్రయాన్ని నిర్మించి వదిలేయకుండా విమానాల రాకపోకలపై దృష్టిపెట్టాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఉన్నతాధికారులకు సూచించారు. ఆ ఎయిర్‌పోర్టును ఉడాన్ పథకంతో అనుసంధానం చేసి ఇతర పెద్ద పట్టణాలతో రాకపోకలకు అనువుగా మార్చాలన్నారు. యూనెస్కో సైట్ రామప్ప, భద్రకాళీ, వెయ్యిస్థంబాల దేవాలయం ఇతర కాకతీయ కట్టడాలతోపాటు టెక్స్‌టైల్ పార్క్ అవసరాలు, భవిష్యత్ పరిశ్రమలకు అనుగుణంగా ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దాలని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి స్వయంగా మామునూర్ ఎయిర్‌పోర్టు స్థితిగతులను పరిశీలిస్తానని మంత్రి చెప్పారు. ఈ సమీక్షలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, అర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ఇఎన్‌సిలు మధుసూదన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

అధికారులపై మంత్రి ఆగ్రహం

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను రిపేర్లు చేయడంలో ఎందుకు ఆలస్యం జరుగుతున్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అంచనాలు, టెండర్లని కాలం వెల్లదీస్తారా అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డిపార్ట్‌మెంట్‌లో సర్వీస్ రూల్స్ కావాలంటే తెచ్చా, ట్రాన్స్‌ఫర్లు చేసుకుంటామంటే అనుమతించా, మీరు ఏదడిగితే అది చేస్తున్నప్పటికి మీ పనితీరు మెరుగుపడటంలేదని వ్యాఖ్యానించారు. మన పక్కరాష్ట్రాల్లో రోడ్ల రిపేర్లకు జెట్ ప్యాచ్ వర్క్ మెషిన్లు, వెలాసిటీ ప్యాచింగ్ వంటి అధునాతన పద్ధతులతో పాట్ హెూల్స్ పడిన వెంటనే పూడుస్తూ ప్రజలకు మెరుగైన రోడ్లు అందిస్తున్నారని గుర్తు చేశారు. దేశంలో అభివద్ధి చెందిన రాష్ట్రంగా ఉన్న మన దగ్గర మాత్రం ఇంకా పురాతన పద్ధతుల్లో పాట్ హెూల్స్ రిపేర్లు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. రూ. 500 కోట్లు ఖర్చు చేస్తే దాదాపు నాలుగు నుంచి ఐదు వేల కోట్ల విలువ చేసే రోడ్లను రిపేర్ చేయవచ్చున్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఆవైపుగా పనులు జరగడం లేదని రోడ్ల సిఇ మోహన్‌నాయక్‌ను ప్రశ్నించారు. మంత్రివర్గ సమావేశంలో చర్చించిన పిపిపి మోడల్ రోడ్ల గుర్తింపు పై స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌ను అడగ్గా, ఇప్పటి వరకు 1787.06 కిలోమీటర్ల కలిగిన 20 రోడ్లను గుర్తించామని చెప్పారు. కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఆర్‌డిసి అనుసరిస్తున్న రోడ్డు నిర్మాణ పద్ధతులను అనుసరిస్తున్నామని అధికారులు మంత్రి దష్టికి తెచ్చారు. నాలుగు టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణంలో ఇప్పటి దాక ఒక్క పురోగతిని చూపించలేదని ఆవేదన చేశారు. ప్రజలు ప్రాథమిక అవసరమైన ఆసుపత్రుల నిర్మాణంలో ఇంత నిర్లక్ష్యం దేనికని ప్రశ్నించారు. ప్రభుత్వం దవాఖానాలు అందు బాటులోకి రాకపోతే పేద ప్రజలు కార్పోరేట్ హాస్పిటళ్లలో లక్షలకు లక్షలు ఖర్చు పెట్టే పరిస్థితి లేదన్నారు. ప్రజల ప్రాణా లకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ముఖ్యమంత్రి తో, ఉప ముఖ్యమంత్రితో మీ ముందే మాట్లాడి బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నా కూడా మీ పనితీరు మెరుగుపడలేదన్నారు. ఇప్పటికైనా అధికారులంతా కలిసికట్టుగా పనిచేసి వచ్చే జూలై, 2025 నాటికి టిమ్స్ ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అపోలో హాస్పిటల్‌లో 'మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్

- తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారి అత్యంత కష్టమైన 'మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్రచికిత్స'ను విజయవంతంగా పూర్తి చేసినట్లు అపోలో హాస్పిటల్స్ వెల్లడించింది. ఇంత పెద్ద ప్రాక్సిమల్ లింబ్ రీఅటాచ్‌మెంట్ చేయడం ఇదే తొలిసారి అని పేర్కొంది. రోగి 26 రోజుల్లో కోలుకోనున్నారని తెలిపింది. వేళ్ల కదలిక మరింత మెరుగుపరిచేందుకు ఆరు నెలల్లో అదనపు శస్త్రచికిత్సలు చేయనున్నామని అపోలో హాస్పిటల్స్ కన్సల్టెంట్ హ్యాండ్, రిస్ట్, రీకన్స్ట్రక్టివ్ మైక్రోసర్జన్ డాక్టర్ జిఎన్ బండారి తెలిపారు. 'మంచిర్యాలకు చెందిన 32 ఏళ్ల పవన్ కుమార్ కుడి మోచేయి విరిగి పోయింది. ప్రాక్సిమల్ హ్యూమరస్‌లో గ్రేడ్ 3సి విరిగిన గాయాలతో అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్‌లో అక్టోబర్ 11న చేరారు. ఇది భుజం మోచేయిని కలుపుతూ ఉన్న భాగం. రీప్లాంటేషన్ కోసం కీలకమైన 4 నుంచి 6 గంటల 'గోల్డెన్ అవర్' సమయం దాటింది. అయినా, అపోలో వైద్య బందం వేగంగా స్పందించింది. రోగిని నేరుగా ఆపరేషన్ థియేటర్‌కు తరలించి తక్షణం చికిత్స అందించామని' తెలిపారు. ఈ శస్త్ర చికిత్స మైక్రోవాస్కులర్ రీప్లాంటేషన్‌లో ఒక కీలక ఘట్టం అన్నారు. గోల్డెన్ అవర్ దాటిన తర్వాత కూడా రీప్లాంటేషన్ సాధ్యమని ఈ శస్త్రచికిత్స నిరూపించింది." అని డాక్టర్ బండారి తెలిపారు.



కంసన్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

- సుమారు రూ 30 కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - హైదరరాబాద్ బ్యూరో

కంసన్ హైజెన్ కేర్ పరిశ్రమలోని డైపర్ తయారీ ప్లాంట్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఖాళీ బూడిదైంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ సమీపంలో ఉన్న కంసన్ హైజెన్ కేర్ పరిశ్రమలోని డైపర్ తయారీ ప్లాంట్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి షెడ్డు మొత్తం మంటలు వ్యాపించాయి. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో పరిశ్రమలో సుమారు 50 మంది కార్మికులు పని చేస్తున్నారు. కార్మికులకు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని కంపెనీ నిర్వాహకులు తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు షాద్‌నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ల నుంచి ఫైర్ ఇంజన్లను రప్పించారు. ఫైర్ సిబ్బంది, స్థానిక పోలీసులు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అప్పటికే పరిశ్రమ మొత్తం కాలి షెడ్డు కూలిపోయింది. షెడ్డులోని సుమారు రూ.30 కోట్ల విలువ చేసే మిషనరీ, మెటీరియల్ పూర్తిగా కాలిపోయాయి. పరిశ్రమ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నందిగామ పోలీసులు తెలిపారు.

లైంగిక దాడి కేసులో నిందితుల అరెస్ట్

- ముగ్గురికి రిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి మహిళపై లైంగికదాడికి ఒడిగట్టిన ముగ్గురు నిందితులను 24 గంటల్లోనే పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చందు, అజయ్, ఆరిష్ పెయింట్ పని చేసుకుంటూ హోంనగర్‌లో రూమ్ అద్దెకు తీసుకొని ఉంటున్నారు. సోమవారం హైటెక్ సిటీ వద్ద ఇళ్లలో పని చేసే మహిళను తమ రూమ్‌లో బట్టలు ఉతకాలని, రూ.500 ఇస్తామని చెప్పి ముగ్గురూ ఆమెను ఆటోలో ఎక్కించుకున్నారు. హోంనగర్‌లోని రూమ్‌కు తీసుకొచ్చి ఆమెపై లైంగికదాడి చేశారు. అనంతరం పరా రయ్యారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే మూడు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. గచ్చిబౌలిలోని బయోడైవర్సీ వద్ద ముగ్గురిని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. పోలీసు బృందాలను ఇన్‌స్పెక్టర్ అభినందించారు. గుర్తు తెలియని వారితో మహిళలు ఎక్కడికీ వెళ్లొద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పెండింగ్ వేతన సవరణను సెటిల్ చేయాలి

- ప్రభుత్వ రంగ బీమా కంపెనీ జాయింట్ ఫోరం ధర్నాలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫ్యామిలీ పెన్షన్‌ను 30 శాతానికి పెంచాలనీ, 2022 ఆగస్టు ఒకటో తేదీ నుంచి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను వెంటనే సెటిల్ చేయాలని నేషనల్, న్యూ ఇండియా, ఓరియంటల్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీల్లో పనిచేస్తున్న ఆఫీసర్లు, ఉద్యోగుల జాయింట్ ఫోరం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ రీజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌జిఐఇ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, జిఐఇఎఐఎ హైదరాబాద్ బ్రాంచి ప్రధాన కార్యదర్శి శివశంకర్, జిఐపిఎ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్‌రెడ్డి, హెచ్ఆర్‌జిఈఏ ప్రధాన కార్యదర్శి వై.సుబ్బారావు, ఓఏసీఓఏ అధ్యక్షులు సబింద్రసింహ, ఎన్ఐసిఒఎ అధ్యక్షులు శశికాంత్, ఎన్ఐఎఒఎ అధ్యక్షులు ఎ నారాయణరావు, తదితరులు ప్రసంగించారు. యాజమాన్యం వాటాను ఎన్‌పిఎస్ ఉద్యోగులకు 14 శాతం పెంచాలనీ, పెన్షన్ అప్‌డేషన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఉద్యోగులందరికీ 1995 పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.